# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 188 | విశాఖపట్నం | 9-4-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 188 | VISAKHAPATNAM | 9-4-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay


### ప్రజా రవాణాకు తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులను

# అందుబాటులోకి తేవాలి: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో రహదారులను గుంతలు లేకుండా పటిష్ఠంగా తీర్చిదిద్దాలని, ప్రజా రవాణాకు తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో బుధవారం ఆయన రహదారులు, భవనాలు (ఆర్ అండ్ బీ), రవాణా శాఖల పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కేవలం మరమ్మతులు చేయడమే కాకుండా, ఆయా ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా నాణ్యమైన రోడ్లను నిర్మించాలని సూచించారు. మెరుగైన రహదారుల ద్వారానే ప్రజలకు మౌలిక సదుపాయాలు చేరువవుతాయని, తద్వారా రాష్ట్రాభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా రవాణా వ్యవస్థపైనా సమీక్షలో చర్చించారు. సామాన్యులపై భారం తగ్గించేలా, అతి తక్కువ వ్యయానికే ప్రయాణం సాగించేందుకు వీలుగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### రాధాకృష్ణ క్షమాపణలు

## చెప్పాలి: అమర్‌నాథ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఏబీఎన్ రాధాకృష్ణ క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. రాధాకృష్ణ తప్పుడు కూతలపై శాంతియుత నిరసన చేపట్టామని అన్నారు. విశాఖలో బుధవారం ఆయన నిరసనలో పాల్గొని మాట్లాడారు. 'దేశంలో అతిపెద్ద స్కాం అమరావతి. మావిగన్ అతిపెద్ద గ్రోత్ కారిడార్. అమరావతిలో 4 వేల రూపాయల ఖర్చు అయ్యే భవనాల చదరపు అడుగు నిర్మాణానికిరూ.14 వేలు ఖర్చు చేస్తున్నారు. జగన్ ది స్టేట్ ఇంట్రెస్ట్ అయితే చంద్రబాబు ది రియల్ ఎస్టేట్. కొత్త పలుకు కాదు చెత్త పలుకు. మేము మీలాగా తప్పులు పనులు చేసి పదవులు పొందలేదు. నీ గురించి నీతోటి జర్నలిస్టులను అడిగితే (తరువాయి 2వ పేజీలో)

### వచ్చే ఏడాది నా పాదయాత్ర...

# చంద్రబాబుకు సినిమా చూపిస్తాం: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన చంద్రబాబు పాలనా తీరును ఎండగట్టారు. వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తాము చేసిన అప్పుల్లో మెజారిటీ వాటా (రూ. 2.73 లక్షల కోట్లు) నేరుగా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి చేరిందని తెలిపారు. చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని... ఈ నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు చెత్తబుట్టలోకి వెళ్లాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు.



4లో

## 'ఉపాధి' పనుల్లో ఫేస్ యాప్ రద్దు చేయాలి

## మోడీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం



2లో



6లో

## మహిళల్లో PCOD/PCOS సమస్యలు-కారణాలు

SJS ఆయుర్వేద వైద్య నిలయం.. పరిష్కారాలు మార్గాలు, నియమాలు

# లోకేశ్ 87వ రోజు ప్రజాదర్బార్



**మంగళగిరి, పతాకం న్యూస్:** రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దక్షిణ కోస్తా రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గ్యాలా డిపోను తరలించవద్దని సిబ్బంది మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కొవిడ్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన తమను ఆదుకునేందుకు రీప్లేస్‌మెంట్ వాహనాలను ఇప్పించాలని హైర్ బస్సుల యజమానులు కోరారు. కర్నూలు జిల్లా, గూడెంపాడుకు చెందిన ఎస్. చిన్న శివమ్మ అనే మహిళ తన వారసత్వ ఆస్తి అయిన 2.63 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని మంత్రిని అభ్యర్థించారు. ప్రజలు సమర్పించిన వినతులను సావధానంగా విన్న లోకేశ్, వాటిని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## జగన్ హయాంలో వ్యవసాయానికి తీరని నష్టం: అచ్చెన్నాయుడు



**పశ్చిమగోదావరి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో వ్యవసాయానికి తీరని నష్టం జరిగిందని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో గోదావరి జిల్లాల్లో కాలువలో కనీసం మట్టి కూడా ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో అచ్చెన్నాయుడు పర్యటించి (తరువాయి 2వ పేజీలో)



## క్రీడా పాఠశాల ప్రారంభమయ్యేనా?

7లో



2లో

## విజయవాడలో హవాలా డబ్బు.. రూ.2 కోట్ల సీజ్





PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## హర్షణీయం..

ప్రభుత్వ విభాగాల్లో ఏళ్ల పర్యంతం తాత్కాలిక ప్రాతిపదికన తక్కువ వేతనాలకు పని చేయించుకోవడం శ్రమ దోపిడీ కిందికే వస్తుందని పేర్కొంటూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పు స్వాగతించదగినది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, తెలుగుగంగ ప్రాజెక్టుల్లోని కొందరు ఉద్యోగులు తమకు దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయంపై సవాల్ చేయగా హైకోర్టు ధర్మాసనం ప్రగతిశీల తీర్పు చెప్పింది. పిటిషనర్ల సర్వీస్‌లను రెండు మాసాల్లో క్రమబద్ధీకరించాలని ఆదేశించింది. తీర్పులో ధర్మాసనం లేవనెత్తిన పలు అంశాలు ప్రభుత్వాల విధానాలను ఎండగడతాయి. తాత్కాలికం పేరిట అవసరమైనప్పుడల్లా నిరంతరాయంగా పని చేయించుకోవడం శ్రమ దోపిడీయేనని చాలా ఏళ్లుగా కార్మికులు, ఉద్యోగులు వాపోతున్నా ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లున్నాయి. శాశ్వత ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయకపోవడం మూలంగా శ్రమ దోపిడీ అంతకంతకూ పెరుగుతూ ఉంది. రెగ్యులర్ ఉద్యోగులు చేస్తున్న పనులనే తాత్కాలిక ఉద్యోగులూ చక్కబెడుతున్నారు. కాని జీతాలు, సౌకర్యాల విషయంలో సమానత లేదు. ఇది ఏకపక్షం, రాజ్యాంగ, చట్ట విరుద్ధం అని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వం శ్రమ దోపిడీకి ఆస్కారం ఇవ్వకూడదని, రాజ్యాంగ బద్ధంగా, ఆదర్శవంతంగా నడుచుకోవాలని గడ్డి పెట్టింది. తమను పర్మినెంట్ చేస్తారన్న ఆశతో ఏళ్లకు ఏళ్లు తక్కువ వేతనాలకు పని చేసి కొత్త ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని న్యాయస్థానం ఆందోళన వెలిబుచ్చింది. కేవలం సాంకేతిక కారణాలతో రెగ్యులరైజేషన్ చేయకపోవడమేంటని ప్రశ్నించి ప్రభుత్వాన్ని అభిశంసించినంత పని చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచబ్యాంక్ ఆదేశిత విధానాలు ప్రారంభమయ్యాక ప్రభుత్వరంగంలో ఉద్యోగ నియామకాలు నిలిచిపోయాయి. దేశంలో నయా-ఉదారవాద ఆర్థిక విధానాలు ఊపందుకున్నాక అటు కేంద్ర ప్రభుత్వంలో ఇటు ఆ విధానాలను పుణికిపుచ్చుకున్న రాష్ట్రాల్లో కొత్త రిక్రూట్‌మెంట్ తగ్గిపోయింది. రోజువారీ అవసరాల నిమిత్తం కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ వచ్చి చేరాయి. వీరికి అరకొర జీతాలు తప్ప రిటైర్మెంట్ బెనిఫిట్ సహా ఎలాంటి సదుపాయాలూ లేవు. కనీసం టైంస్కేల్ కూడా లేదు. మన రాష్ట్రంలో శాశ్వత ఉద్యోగులతో సమాన సంఖ్యలో తాత్కాలిక ఉద్యోగులు పని చేస్తున్నారు. మూడు లక్షల మంది ఔట్‌సోర్స్, లక్ష మంది కాంట్రాక్టు, మరో 50 వేల వరకు దినసరి, ఎన్‌ఎంఆర్, కంటింజెంట్, పార్ట్‌టైం, కన్సాలిడేట్ పేర్లతో పని చేస్తున్నారు. అంగన్‌వాడీలు, ఆశాలు, వెలుగు విఒఎలు, మెప్మా ఆర్‌పిలు వెట్టి చాకిరీ చేస్తున్నారు. వాస్తవానికి పాలన సాగేది వీరిపైనన్నది నిజం. వీళ్లు లేకపోతే ప్రభుత్వ పథకాల అమలు అసాధ్యం. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వీరే. కాని వారు అనుభవిస్తున్న క్షోభను ఆలకించడానికి సిద్ధపడకుండా తమ ప్రభుత్వం ఎంప్లాయి ఫ్రెండ్లీ అని ఎవరు చెప్పినా నీటి మీది రాతగా పరిగణించాల్సి ఉంటుంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను తలకెత్తుకుంది. ప్రైవేట్ పెట్టుబడుల కోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రవేశపెట్టింది. రెండు ప్రభుత్వాలూ కార్మిక వ్యతిరేకత, కార్పొరేట్ల అనుకూలతను సంతరించుకొని విధానాలు రూపొందిస్తున్నాయి. స్వాతంత్ర్యం పూర్వం నుంచే కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా కుదించింది. కార్మిక వర్గం లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని పోరాడుతోంది. మోడీ కంటే ముందే రాష్ట్రంలో కార్మిక చట్టాలకు కూటమి ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ తరుణంలో హైకోర్టు వెలువరించిన తీర్పు కార్మికులకు, ఉద్యోగులకు కారుచీకటిలో కాంతి రేఖ. అందుకే అన్ని వర్గాల నుంచి కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాగా గతంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల విషయంలో హైకోర్టు ప్రభుత్వ తీరును తప్పుబట్టగా ప్రభుత్వం స్పందించకుండా దాటవేసింది. ఇప్పుడు కూడా అటువంటి కుయుక్తులకు అవకాశం ఉంది. కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. హైకోర్టు తీర్పుకనుగుణంగా తాత్కాలిక ఉద్యోగుల, కార్మికుల సర్వీసులను ప్రభుత్వం తక్షణం క్రమబద్ధీకరించాలి. అప్పటి వరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సదుపాయాలు కల్పించాలి.

## విజయవాడలో హవాలా డబ్బు.. రూ.2 కోట్ల సీజ్



**విజయవాడ, పతాకం న్యూస్:** నగరంలోని గుణదల ప్రాంతంలో హవాలా డబ్బు కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. సుమారు రూ.2 కోట్లకు పైగా నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ డబ్బును ఒడిశా రాష్ట్రం నుంచి విజయవాడకు అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా ఈ హవాలా డబ్బు బయటపడింది. వెంటనే నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. డబ్బు తరలించడానికి ఉపయోగించిన కారును కూడా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న నగదును తదుపరి విచారణ కోసం ఇన్కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగించారు. ఈ వ్యవహారంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. హవాలా నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

## అమరావతిలో రూ.2,534 కోట్లతో కేంద్రం భారీ నిర్మాణాలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.2,534 కోట్లతో అమరావతిలో కేంద్రం భారీ నిర్మాణాలను చేపట్టనుంది. అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం రూ.1,299.08 కోట్లు, నివాస సముదాయాల ఏర్పాటు కోసం రూ.1,234.91 కోట్లతో కూడిన పీఐబీ మెమోరాండం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగాలంటే కేబినెట్ సెక్రటేరియట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌కు క్లియరెన్స్ రావాల్సి ఉంది. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ వెలువడిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ అధికారులు ఇప్పటికే కేబినెట్ సెక్రటేరియట్‌కు సమర్పించారు. వచ్చే కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అనుమతి లభించే అవకాశం ఉంది. ప్రాజెక్టు తదుపరి అనుమతులకు కీలకమైన కేబినెట్ సెక్రటేరియట్ క్లియరెన్స్ మాత్రమే పెండింగ్ ఉంది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఫైల్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపారు. అమరావతిలో కేంద్ర నిర్మాణాల కోసం మొత్తం 22.53 ఎకరాల భూమిని కేటాయించారు. సీపీడబ్ల్యూడీ కోసం 22.53 ఎకరాల భూమిని ఏపీ ప్రభుత్వం ఆఫర్ చేసింది. ఇందులో 5.53 ఎకరాలు సెక్రటేరియట్ నిర్మాణానికి, 17 ఎకరాలు నివాస సముదాయాల ఏర్పాటుకు కేటాయించారు. కేబినెట్ సెక్రటేరియట్ నుంచి క్లియరెన్స్ వచ్చిన వెంటనే అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది.

## మోడీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

## చెప్పాలి: అమర్‌నాథ్

(మొదటిపేజీ తరువాయి)

చెబుతారు. జర్నలిస్ట్ స్థాయి నుంచి కంపెనీకి అధిపతివి ఎలా అయ్యావు? ఎన్టీఆర్కు చంద్రబాబు వెన్నుపోటు, నువ్వు పెన్నుపోటు పొడిచావు' అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ.. 'రాధాకృష్ణవి నీచమైన రాతలు. రాధాకృష్ణ పాపం పండింది. అందుకే ఇలాంటి రాతలు రాశాడు. మహిళలకు రాధాకృష్ణ క్షమాపణ చెప్పాలి. బాబు, లోకేష్ మెప్పు కోసమే రాధాకృష్ణ ఇలాంటి రాతలు రాస్తున్నాడు. రాధాకృష్ణ రాతలు చూసి చంద్రబాబు రాక్షస ఆనందం పొందుతున్నారు. ఆంధ్రజ్యోతి పత్రికలో మహిళలకు క్షమాపణ చెబుతూ వార్త రాయాలి' అని అన్నారు. మావిగన్నె పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని విశాఖ నగర వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. దీని నుంచి ప్రజల దృష్టి మరల్చడం కోసం మహిళలపై పిచ్చి రాతలు రాశారని చెప్పారు. రాధాకృష్ణ పిచ్చి పరాకాష్ఠకు చేరుకుందని తెలిపారు. జర్నలిజం విలువలను రాధాకృష కాలరాశారని అన్నారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారని తెలిపారు. రాధాకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా ఉంది...

## గవర్నర్ జోక్యం చేసుకోవాలి: బొత్స



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్పుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ తప్పుడు, అసంపూర్ణ సమాచారాన్ని శాసనమండలికి సమర్పించిందని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. ఫిబ్రవరిలో జరిగిన మండలి సమావేశాల్లో ఓ ప్రశ్నకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన సమాధానంలో వాస్తవ అప్పుల వివరాలు పూర్తిగా లేవని, గణాంకాలను తక్కువ చేసి చూపారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ కాపీని వైసీపీ మీడియాకు విడుదల చేసింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం అప్పులు రూ. 60,485 కోట్లుగా పేర్కొన్నారని, అయితే కాగ్ ఆడిట్ ప్రకారం వాస్తవ నికర అప్పులు రూ. 81,082 కోట్లుగా ఉన్నాయని బొత్స వివరించారు. ఈ రెండింటి మధ్య రూ. 20,500 కోట్లకు పైగా తేడా ఉందని, దీనికి సరైన కారణాలు కనిపించడం లేదని తెలిపారు. ఆర్బీఐ నుంచి తీసుకున్న 'వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు', పబ్లిక్ అకౌంట్ కింద ఉన్న డిపాజిట్లు, రిజర్వ్ ఫండ్స్ వంటి ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం తన లెక్కల్లో కలపలేదని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, 2025-26లో ఆఫ్-బడ్జెట్ రుణాలు ఏవీ లేవని ప్రభుత్వం చెప్పడం కూడా సరికాదన్నారు. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు సమీకరించారని, ఇవి కూడా ప్రభుత్వ అప్పుల కిందకే వస్తాయని గుర్తుచేశారు. శాసనసభకు తప్పుడు సమాచారం ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బొత్స అన్నారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని, తప్పుడు సమాధానాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అలాగే, ఈ తేడాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనానికి సంబంధించిన విషయాల్లో పారదర్శకత చాలా అవసరమని బొత్స తన లేఖలో స్పష్టం చేశారు.

## రూ.185 కోట్లతో విజయవాడ స్టేడియం అభివృద్ధి: మంత్రి మండిపల్లి




**విజయవాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రవాణా, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడల వికాసానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోపాటు యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. లోకేశ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాంధ్ర ప్రదేశ్ కావడం తథ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియాన్ని (ఏజీఎంసీ) వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా మరో రూ.20 కోట్లు.. అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.160 కోట్లను మూడు దశల్లో ఖర్చు చేయనుందని మంత్రి మండిపల్లి తెలిపారు. విజయవాడకు తలమానికంగా నిలిచిన ఈ స్టేడియం గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైందని మంత్రి మండిపడ్డారు. ప్రస్తుతం ఎంపీ కేశినేని శివనాథ్ నాయకత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, శాప్ సమన్వయంతో దీని అభివృద్ధికి జీవో తీసుకురావడం జరిగిందని చెప్పారు. విజయవాడ స్టేడియం అభివృద్ధితోపాటు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా క్రీడల వికాసానికి ఎంపీ అపూర్వ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం మంత్రులు, ఎంపీలు నిరంతరం కేంద్ర మంత్రులను కలిసి ఏపీకి కావాల్సిన నిధులను సాధిస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా విజయవాడ ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి శాశ్వత గుర్తింపు రావడంతో విజయవాడకు మహర్దశ పట్టనుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అమరావతి ప్రాంతంతో పాటుగా విశాఖ, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగవుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ వెల్లడించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కానుందని, స్పోర్ట్స్ యూనివర్శిటీ కూడా ఏర్పాటు కానుందని ఆయన పేర్కొన్నారు. అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ స్పోర్ట్స్ సిటీని నిర్మించాలని సీఎం చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారని శివనాథ్ తెలిపారు. మహిళా క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించేలా కూటమి సర్కార్ ముందుకు సాగుతోందన్నారు. యువ కెరటాలైన అధికారులు జిల్లా యంత్రాంగంలో ఉండటం ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు.

## జగన్ హయాంలో వ్యవసాయానికి తీరని నష్టం: అచ్చెన్నాయుడు

(మొదటిపేజీ తరువాయి)

, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో అన్నదాతలు చేసేదేమీ లేక క్రాప్ హాలిడే ప్రకటించారని ప్రస్తావించారు. జగన్ దుర్మార్గుడు.. రూ.12 లక్షల కోట్లు అప్పు చేసి పోయారని ధ్వజమెత్తారు. దుర్మార్గుడు జగన్ చేసిన అప్పులకు తమ ప్రభుత్వం వడ్డీ కడుతోందని చెప్పుకొచ్చారు. రానున్న రోజుల్లో వ్యవసాయ కాలువలను ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో జగన్ పోలవరాన్ని ముంచేశారని ఆగ్రహించారు. దిక్కుమాలిన పేపర్, దిక్కుమాలిన టీవీతో పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కోకు దమ్ము ధైర్యం ఉంటే రావాలని.. ఐదేళ్లలో వ్యవసాయానికి ఎంత ఖర్చు పెట్టారో మాట్లాడుదామని అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు.

# ప్రమాదకరంగా చెరువు మలుపులు



**తూర్పుగోదావరి జిల్లా, పతాకం న్యూస్:** కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల శివార్లలో చెరువుల వద్ద మలుపులు ప్రమాద భరితంగా మారాయి. చెరువుల చుట్టూ నిర్మించిన రహదారులపై వెళ్లే ప్రయాణికులకు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. ఆ మలుపుల్లో ఎటువంటి రక్షణ ఏర్పాట్లు లేవు. టేకి శివారులోని బ్రాహ్మణ చెరువు మలుపు, తాతపూడి రహదారిలోని చెరువు మలుపు, అంగర రహదారిలోని చెరువు మలుపు, నిడసన మెట్ల చెరువు మలుపు, అచ్యుతాపురం చెరువు మలుపు, మాచర శివారు, మాచల మట్టలు శివారు చెరువు మలుపు ప్రమాదం కరంగా ఉన్నాయి. ప్రతినిత్యం వాహనాలు తిరగడంతో వాటి మీదుగా ప్రయాణించే వారికి భయాందోళన కలిగిస్తున్నాయి. చెరువుల మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో మలుపుల వద్ద ప్రమాదాల జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు కోరుతున్నారు. చెరువుల మలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే గణబాబు



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. జివిఎంసి 89, 90, 91, 92 వార్డుల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై అన్ని శాఖల అధికారులతో గోపాలపట్నంలోని పిన్నమనేని హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు భవిష్యత్తు కార్యాచరణపై ఎమ్మెల్యే సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ కె.హేమావతి, ఎస్ఇ ప్రవీణ్ కుమార్, ఇఇ ప్రసన్న, ఎఇ ఇపిడి చిరంజీవి, కూటమి నాయకులు అంగ ప్రశాంతి, బొడ్డేటి విజరు, దాడి రమేష్, బొమ్మిది రమణ, ఎలమంచిలి ప్రసాద్, సరగడం అరుణ్, నరవ అనూష, నారిపిన్ని సత్తిరాజు, కంపరం ఆనంద్, దాడి రమేష్ నాయుడు, నాదెళ్ల జ్యోతి పాల్గొన్నారు.

## జీవీఎంసీలో వార్డుల విభజనకు
# ముమ్మర కసరత్తు



**విశాఖపట్నం,, పతాకం న్యూస్:** జివిఎంసిలో మొత్తం వార్డుల సంఖ్యను 98 నుంచి 120కి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో వార్డుల పెంపు విషయమై అధికారులు ముమ్మర కసరత్తు చేపట్టారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం ఈ ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గంలో కూడా వార్డుల పునర్విభజన కార్యక్రమాన్ని చేపట్టారు. 2021లో జరిగిన జివిఎంసి ఎన్నికలలో 14 వార్డులు దక్షిణ నియోజకవర్గంలో ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 3 నుంచి 4 వార్డులు పెరగవచ్చని భావిస్తున్నారు. 2011 జనాభా ప్రాతిపదికన వార్డుల పునర్విభజన జరుగుతోంది. 2021లో జరిగిన ఎన్నికలలో ఒక్కొక్క వార్డులో సరాసరి 14 వేల నుంచి 20 వేల మంది వరకు ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు ఈ సంఖ్య ఒక్కొక్క వార్డులో13 వేల నుంచి 17 వేల మధ్యలో ఉండే అవకాశం ఉందని అంటున్నారు. 2007లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో దక్షిణ నియోజకవర్గంలో 11 వార్డులు ఉండేవి. 2021 నాటికి వార్డుల సంఖ్య 14కు పెరిగింది. అందులో 42వ వార్డులో కొంత భాగం దక్షిణ నియోజకవర్గంలో ఉండగా, స్వల్ప భాగం ఉత్తర నియోజకవర్గం పరిధిలో కలిసి ఉంది. వార్డుల పునర్విభజన కార్యక్రమం ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు జరుగుతోంది. అప్పటికి వార్డుల విభజన ప్రకారం పూర్తయిన ఓటర్ల జాబితాపై ఈ నెల 10 నుంచి 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 17 నుంచి 25వ తేదీ మధ్య సిద్ధం చేసిన జాబితాను ప్రభుత్వానికి పంపిస్తారు. ఈ నెల 26 నుంచి మే 2వ తేదీలోగా తుది జాబితా ప్రచురణ జరుగుతుంది. ప్రచురించిన జాబితాను మే 3 నుంచి 6వ తేదీలోగా బహిరంగంగా ప్రకటించనున్నట్టు అధికారులు తెలిపారు. వార్డుల సంఖ్య పెరగడంతో పాటు వార్డుల రిజర్వేషన్లలో కూడా మార్పులు జరుగుతాయని అధికారులు తెలిపారు. జివిఎంసి పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలతో పోలిస్తే దక్షిణ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటికి నియోజవర్గంలో ఓటర్ల సంఖ్య 2 లక్షలా 9 వేలా 313 మాత్రమే. ఈ కారణం వల్ల వార్డుల పునర్విజన తర్వాత అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే దక్షిణ నియోజకవర్గంలో తక్కువ సంఖ్యలో వార్డులు ఏర్పడనున్నాయి.

## ప్రభుత్వ భూముల్లో
## అక్రమ కట్టడాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ఆనందపురం, పతాకం న్యూస్:** ఆనందపురం మండలం కణమాం గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 50, 13లలో ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ కట్టడాలు, లే-అవుట్లు ఏర్పాటు చేస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుడు చందపరపు ప్రకాష్ ఫిర్యాదు చేశారు. జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రత్యేకంగా సర్వే నంబర్ 13లో సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమంగా లే-అవుట్లు వేసి ప్లాట్లుగా అమ్మకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ అక్రమ నిర్మాణాలకు ప్రభుత్వ నిధులతో సిసి రోడ్డు కూడా వేసినట్లు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించడమే కాకుండా ప్రజాధనాన్ని స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నట్లుగా ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే 2025 నవంబర్ 3వ తేదీన స్థానిక రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అప్పటికి కేవలం పునాదుల స్థాయిలో ఉన్న నిర్మాణాలు ప్రస్తుతం షెడ్లుగా మారాయని పేర్కొన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం లేదా పరోక్ష సహకారం వల్లే ఈ నిర్మాణాలు పూర్తయ్యాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలు, లే-అవుట్లను వెంటనే తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, ఆ భూమిని ఇల్లు లేని అర్హులైన పేదలకు ఇవ్వడానికి వినియోగించాలని కలెక్టర్‌ను కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## స్మార్ట్ కిచెన్ పేరుతో స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్నం భోజనం విరుమించుకోవాలి




**దేవరాపల్లి, పతాకం న్యూస్:** డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంను స్మార్ట్ కిచెన్ ల పేరుతో ప్రైవేటు సంస్థల కు అప్పగించే ప్రయత్నాలు విరమించు కోవాలి, మెనూచార్జీలు, కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తు బుధవారం ఎంఇఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపాట్టారు,విరిగి మద్దుతుగా సిఐటియు మండల కార్యదర్శి బిటి దొర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి వెంకన్న మద్దతుగా పల్గోని మాట్లాడారు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక నిర్వహణ నుండి కూటమి ప్రభుత్వ తప్పు కోవాలని ఆలోచిస్తుందని తెలిపారు. ప్రభుత్వ బాధ్యత లేకుండా ప్రైవేట్ సంస్థలకు పథకం అప్పగించడం వల్ల, స్మార్ట్ కిచెన్లు వల్ల ఒకచోట వంట చేసి ఇతర ప్రాంతాల్లోని స్కూళ్ళకు బాక్స్ లో ఆహార పదార్ధాలు పంపించడం వల్ల పిల్లలు వేడి వేడి ఆహారానికి దూరమౌతారని తెలిపారు.ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథక నిధులను ప్రైవేట్, స్వచ్ఛంధ సంస్థలకు చెల్లిస్తారని. అంతేకాక ఇప్పటి దాకా ఈ పథకంలో సేవ లందిస్తున్న నిరు పేదలైన పేద మహిళలుగా ఉన్నారని తెలిపారు విరు అందరు పూర్తిగా ఉపాధిని కోల్పోతారని అన్నారు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాల ల్లో వంట షెడ్లను శాశ్వత ప్రాతి పదికన నిర్మించి, ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20/- ల చొప్పున మెనూ చార్జీలు కేటాయించి, స్థానికంగా కార్మికులే వంట చేసి పిల్లలకు ఆహారాన్ని అందించాలని, స్మార్ట్ కిచెన్లు పేరుతో ప్రైవేట్ సంస్థలకు పథకాన్ని అప్పగించే ఆలోచలను రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించు కోవాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్నా భోజన పథక కార్మికుల యూనియన్ డిమాండ్ చేస్తుంది ఇప్పటికే ప్రైవేటు సంస్థలైన అక్షయ పాత్ర, ఇస్కాన్ వంటి ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్న చోట పిల్లలు చల్లారి పోయిన చప్పటి భోజనం తినలేక పడేస్తున్నారని తెలిపారు విశాఖ, తూ॥గో, తిరుపతి, నెల్లూరు, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో ఇస్కాన్, అక్షయపాత్ర వంటి సంస్థలు తయారుచేస్తున్న ఆహారం నాసిరకంగా ఉండటమే కాక, ఉల్లి, వెల్లులి లేక పోవడం, ఉప్పు, కారాలు తక్కువ ఉండటం వల్ల ఆ భోజనం చప్పగా ఉంటున్నదని పేర్కొన్నారు.పిల్లలు ఆభోజనం తినక పోవడంతో చెత్త కుప్పలలో పడేస్తున్నారని తెలిపారు. మంగ ళగిరిలో పందుల పెంపకం దారులు ఈ ఆహారాన్ని పందులకు ఆహారం పెట్టడం కోసం తీసుకు వెళుతున్నారని సుప్రీంకోర్టు సహితం పాఠశాల లోనే వేడివేడిగా పిల్లలకు ఆహారం వండి పెట్టాలని చెప్పిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను మన రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తూ స్మార్టెకి చెన్ లను తీసుకువచ్చే విధానాన్ని ఉ పసంహరించుకోవాలి.రాష్ట్ర వ్యాప్తంగా కిచెన్ షెడ్లు లేని పాఠశాలలో కిచన్.సేడ్లు నిర్మించాలని, పథకం అమలుకు మౌలిక సౌకర్యాలు (మంచినీరు, గౌజులు, మాస్కులు, యాప్రాన్) కల్పించాలని, పథకం నిర్వహిస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.10,000/-ల వేతనం ఇవ్వాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్ధికి రూ. 20/-లు మెనూ చార్జీలు ఇవ్వాలని వారు డిమాండ్ చేసారు ఈకార్యక్రమంలో కోలా మేరి రత్నం పల్లి రాములమ్మ సింగం పల్లిమహలక్ష్మీ రాయి సన్యాసమ్మ గాలిగంగమ్మ దాసరిరాము పులిగ రమణమ్మ కంచి మలలక్ష్మీ తో పాటు అదికసంఖ్యలో మద్యాహ్నం బోజనం కార్మికులు పాల్గొన్నారు మేరి రత్నం, పల్లి రాములమ్మ సింగం పల్లిమహలక్ష్మీ,రాయి సన్యాసమ్మ, గాలిగంగమ్మ దాసరిరాము ,పులిగ రమణమ్మ కంచి మలలక్ష్మీతో పాటు, అదిక సంఖ్యలో మద్యాహ్నం బోజనం కార్మికులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** జిల్లాకు సంబంధించి నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను అధికారులు విధిగా సాధించాలని కలెక్టర్ టి.నిశాంతి ఆదేశించారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభివృద్ధి పనులు చేపడుతున్న క్రమంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించి ముందుకు సాగుతూ ప్రగతిని సాధించాలన్నారు. ప్రధానంగా జిల్లాలో సంపూర్ణత అభియాన్ 2.0 సూచికలను పక్కాగా అమలు చేయాలని, ఇందులో భాగంగా విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. మాతా శిశు మరణాలను అరికట్టాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని, స్వయం ఉపాధి, వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని, మారుమూల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. జిల్లా అభివృద్ధి కేవలం గణాంకాలు మాత్రమే కాకుండా సామాన్యుడి జీవితంలో మార్పును తీసుకుని రావాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ లక్ష్యాలను విధిగా చేరుకోవాలన్నారు. ఈక్ష్మర్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో టి.పూజ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ విద్యాసాగరరావు, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కృష్ణమూర్తినాయక్, ఏడీఎంహెచ్‌వో టి.ప్రతాప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డిసిఐఎల్, కొలంబో డాక్‌యార్డ్ మధ్య ఎంఒయు



**గోపాలపట్నం, పతాకం న్యూస్:** భారత్, శ్రీలంకల మధ్య సముద్ర రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డిసిఐఎల్), కొలంబో డాక్‌యార్డ్ పిఎల్‌సి (సిడిపిఎల్‌సి) మధ్య కీలక అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం దక్షిణాసియాలో సముద్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఒక ప్రధాన మైలురాయిగా భావిస్తున్నారు. ఈ భాగస్వామ్యంతో డిసిఐఎల్ విస్తృత డ్రెడ్జింగ్ నౌకాదళం, కార్యాచరణ నైపుణ్యం సిడిపిఎల్‌సి ఆధునిక నౌకా నిర్మాణ, మరమ్మతు సదుపాయాలతో ఏకీకృతమవుతాయని అధికారులు తెలిపారు. నౌకల నిర్వహణ, మరమ్మతు, రెట్రోఫిట్టింగ్, కొత్త నౌకల నిర్మాణంలో అధిక నాణ్యతతో, తక్కువ వ్యయంతో సేవలు అందించడం ఈ ఒప్పందం ముఖ్య లక్ష్యం. ఈ సందర్భంగా డిసిఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సిఇఒ కెప్టెన్ ఎస్.దివాకర్ మాట్లాడుతూ ఈ అవగాహనా ఒప్పందం కార్యాచరణ శ్రేష్టత, నౌకాదళ ఆధునీకరణ, ప్రాంతీయ భాగస్వామ్యాల విస్తరణ పట్ల తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. నౌకానిర్మాణం, ఆఫ్‌షోర్ సహాయక నౌకల రంగాల్లో కొత్త అవకాశాలను అన్వేషించడమే తమ లక్ష్యమని తెలిపారు. సిడిపిఎల్‌సి మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సిఇఒ తిమిర ఎస్ గొడకుంబుర మాట్లాడుతూ డిసిఐఎల్‌తో భాగస్వామ్యం కావడం గర్వకారణమని, ఈ ఒప్పందం ద్వారా దక్షిణాసియాలో సముద్ర సేవల రంగంలో తమ స్థానం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. సాంకేతిక మార్పిడి, సుస్థిర వృద్ధికి ఇది కొత్త అవకాశాలను తెరుస్తుందని చెప్పారు. ఈ అవగాహనా ఒప్పందం సంతకాల కార్యక్రమానికి శ్రీలంకలోని భారత హైకమిషనర్ సంతోష్ ఝా, మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ సిఎమ్‌డి కెప్టెన్ జగ్మోహన్, డైరెక్టర్ బిజు జార్జ్, కౌన్సిలర్ దేవికా లాల్ తదితరులు హాజరయ్యారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ -- శ్రీలంక సముద్ర సంబంధాలు మరింత బలపడటంతో పాటు ప్రాంతీయ సముద్ర పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి కూడా గణనీయమైన ఊతం లభించనుందని అధికారులు తెలిపారు.

## మాకవరపాలెంలో సియట్ టైర్ల కంపెనీ



**మాకవరపాలెం, పతాకం న్యూస్:** నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం మండలంలో మరో భారీ కంపెనీ ఏర్పాటు కానున్నది. ప్రముఖ టైర్ల ఉత్పత్తిదారు అయిన 'సియట్ టైర్స్' రాచపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 737లో 200 ఎకరాలు అవసరమని దరఖాస్తు చేసుకుంది. దీంతో ఏపీఐఐసీ అధికారులు, సియట్ టైర్స్ కంపెనీ ప్రతినిధులు ఇక్కడకు వచ్చి భూములను, మ్యాపులను పరిశీలించారు. రాచపల్లి సర్వే నంబరు 737లో వున్న ఎరకన్నపాలెం, రామన్నపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల్లో 406.85 ఎకరాలను రెవెన్యూ శాఖ నుంచి ఇటీవల ఏపీఐఐసీ అధికారులు తీసుకున్నారు. ఇందులో 150 ఎకరాలను డోజ్కో కంపెనీకి, 20 ఎకరాలను ఎంఎస్‌ఎంఈ పార్కుకు కేటాయించారు. ఇంకా సుమారు 240 ఎకరాలు మిగిలి వుంది. ఈ నేపథ్యంలో సియట్ టైర్ల కంపెనీ ఏర్పాటుకు 200 ఎకరాలు అవసరమని ఆ కంపెనీ యాజమాన్యం కోరింది. దీంతో మంగళవారం తహశీల్దారు ముజీబ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు నరసింహారావు, మండల సర్వేయరు వెంకటేశ్వరరావు, సియట్ టైర్ల కంపెనీ ప్రతినిధులు ఇక్కడకు వచ్చి భూములను పరిశీలించారు. మిగిలిన సుమారు 40 ఎకరాలను ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీకి కేటాయిస్తామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ తెలిపారు.

## పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్స్యూరెన్స్ కొనసాగించాలి

**గాజువాక, పతాకం న్యూస్:** : స్టీల్‌ప్లాంట్‌కు చెందిన సుమారు 21 వేల మంది విశ్రాంత ఉద్యోగులకు మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని సిఐటియు నాయకులు ఎన్.రామారావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ ఇన్స్యూరెన్స్ పెంపును వ్యతిరేకిస్తూ ఉక్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట విశ్రాంత స్టీల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్.రామారావు మాట్లాడుతూ, స్టీల్ యాజమాన్యం మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియాన్ని భారీగా పెంచి విశ్రాంత ఉద్యోగులపై అదనపు ఆర్థిక భారం మోపుతోందని విమర్శించారు. పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగుల పట్ల యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి సరైంది కాదన్నారు. గతంలో ఒక్కొక్కరు రూ.1300 చెల్లించగా, ప్రస్తుతం రూ.8512కు పెంచడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకుని పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## శాస్త్రీయ, వైద్య విజ్ఞానం ద్వారానే ప్రజారోగ్యం




**సాలూరు, పతాకం న్యూస్:** శాస్త్రీయ, వైద్య విజ్ఞానాన్ని నమ్మడం ద్వారా ప్రజారోగ్యం సాధ్యమని, ఆరోగ్యం కోసం అందరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఆరోగ్య కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిఎంహెచ్ఒ, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొని వరల్డ్ హెల్త్ డే స్లోగన్స్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన మీదే ఆధారపడి ఉందని, మారుతున్న జీవనశైలి, కలుషిత వాతావరణం వల్ల కొన్ని వ్యాధులు ప్రభలుతాయని, పర్యావరణానికి హానికరం కాని, ఆరోగ్యకరమైన జీవశైలి, ఆహార నియమావళి అవలంభించాలని పేర్కొన్నారు. ఆరోగ్య అంశాలకు సంబంధించి అపోహలు, మూఢ నమ్మకాలు విడనాడి శాస్త్రీయ వైద్య విజ్ఞానం ద్వారా అందించే ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఆహారం, వ్యాయామం, యోగా, మానసిక ప్రశాంతత, పరిశుభ్రత మొదలగు సూత్రాలను పాటించి ఆరోగ్యం తద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వై.విజయ మోహన్, డాక్టర్ టి.జగన్ మోహనరావు, డాక్టర్ ఎం.వినోద్ కుమార్, డాక్టర్ సూర్య కౌశిక్, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ నగేష్ రెడ్డి, డిపిఒ లీలారాణి, డెమోలు ప్రసాద్, గిరి బాబు, సూపర్వైజర్లు విజయలక్ష్మి, పుష్ప, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుశాంత్ జన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మన కుటుంబాన్ని మన దేశాన్ని ఆరోగ్యంగా ఉంచగలమని అన్నారు. ఇందుకు విద్యార్థులు వ్యాయామాన్ని తప్పకుండా చేయాలని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల వృథాను అరికట్టడం ద్వారా కలుషితం కాకుండా ఉండడాన్ని మనమంతా పాటించడం ద్వారా ప్రపంచ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వగలమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు మంజుల, లలిత కుమారి, ఫణి కుమారి, ఐక్య సికోఆర్డినేటర్ రవికిరణ్, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.శంకర్రావు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.గుమ్మలక్ష్మీపురం : పోషక విలువలు కలిగిన ఆహార ఉత్పత్తుల ఇంటి వంట ఆరోగ్యానికి మంచిదని, ప్రతిరోజు వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తాడికొండ పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడికొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూఢనమ్మకాలు వీడి విజ్ఞానానికి అండగా నిలుద్దామని, ఆరోగ్యం కోసం కలిసి పని చేద్దామంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌పిలు సింహాచలం, భారతి, ఆరోగ్య కార్యకర్తలు ఎన్.రత్నప్రసాద్, ఎస్‌వి ప్రకాష్, బి.లక్ష్మణరావు, ఎఎన్ఎంలు, ఆశాలు, సిహెచ్‌డబ్ల్యూఒలు ఉన్నారు.

## అకాల వర్షాలతో రైతులకు నష్టాలు



**రాజాం, పతాకం న్యూస్:** గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతుల ఆశలను తుంచేస్తున్నాయి. మామిడి, మొక్కజొన్న, వరి పంటలు చేతికొస్తున్న తరుణంలో కురుస్తున్న వర్షాలు, వీస్తున్న గాలులు రైతులను నష్టాల పాల్జేస్తున్నాయి. రెండు రోజులుగా ఈదురుగాలులు, కురిసిన వడగండ్ల వర్షాలకు పలు చోట్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాజాం మండలం యం జోగివలస, గారా చీపురుపల్లి, జెండాల దిబ్బలో గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన గాలులకు పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన మామిడి పంట నేలరాలడంతో రైతులు కన్నీరు మున్నీరు వుతున్నారు. ఈదురుగాలుల ధాటికి మామిడికాయలు రాలిపోయాయి. మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. సుమారు 20 నుండి 30 ఎకరాల వరకు పంట నష్టపోయామని రైతులు తెలుపుతున్నారు. అసలే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో ఆందోళనలో ఉన్న రైతులను ఈ అకాల వర్షాలు కారణంగా మరింత ఒత్తిడికి గురవుతున్నారు. పంట నష్టంపై పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి పంట నష్ట పరిహారాన్ని అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## గ్యాస్ సమస్యను పరిష్కరించి చిన్న వ్యాపారులను ఆదుకోవాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** గ్యాస్‌ను అందుబాటులోకి తెచ్చి చిరు వ్యాపారులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం రామకృష్ణ నగర్ లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ పై ఇజ్రాయిల్ ద్వారా అమెరికా చేస్తున్న యుద్ధంతో నేడు దేశవ్యాప్తంగా గ్యాస్ సమస్య వచ్చిందని, దీంతోచిరు వ్యాపారులు, బిర్యాని,నూడిల్స్, టిఫిన్స్ అమ్ముకొని జీవనం సాగించే చిరు వ్యాపారులు గ్యాస్ లేక వ్యాపారం వదిలేసి రోడ్డున పడ్డారన్నారు. వారిని ఆదుకోవాలని, గ్యాస్ సమస్య తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇస్తామన్నా ఉచిత గ్యాస్ సిలెండర్లు సప్లై చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర్ కమిటీ నాయకులు శాశీతమూర్తి, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య పరిశ్రమలపై చర్యలు చేపట్టాలి




**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక ప్రాంతంలో కాలుష్యం నివారించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన పాదయాత్ర సోమవారానికి రెండో రోజుకు చేరుకుంది. యాదవ జగ్గరాజుపేట, తుంగ్లాం, చుక్కవానిపాలెం, కుంచుమాంబ కాలనీ, దత్తసాయినగర్, విశ్వేశ్వర్‌నగర్ కాలనీలో ఈ పాదయాత్ర సాగింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ గంగవరం పోర్టు కాలుష్యం, రామచంద్రనగర్ డంపింగ్ యార్డు, ఫార్మా కంపెనీలు, అక్కిరెడ్డిపాలెం గొడౌన్స్ తదితరాల కాలుష్యంతో గాజువాక ప్రజలు అనారోగ్యాలతో బాధపడుతున్నారని తెలిపారు. రామచంద్రనగర్ డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పందించి గాజువాక ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. జివిఎంసి 78వ వార్డు సిపిఎం మాజీ కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, గాజువాక ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధులు, కేన్సర్, ఆస్మాతో రకరకాల సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. అదాని పోర్టు వల్ల మొత్తం గాజువాక అంతా బొగ్గు మయమైందని పేర్కొన్నారు. దీంతో ప్రజలందరూ ఇబ్బంది పడుతున్నారన్నారు.

దత్త సాయినగర్‌లో జరిగిన పాదయాత్రలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కాలుష్యానికి సంబంధించిన పరిశ్రమలకు గాజువాకలో అనుమతి ఇవ్వరాదని కోరారు. కాలుష్య పరిశ్రమలపై పొల్యూషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, జి.రాము, కె.సంతోషం, ఎం.శ్రీదేవి, అవతారం, యు.రాజు, వెంకటేష్, వీరాస్వామి, చిట్టిబాబు, త్రినాథ్‌స్వామి పాల్గొన్నారు.

## మెనూ పాటించకపోతే కఠిన చర్యలు



**సాలూరు, పతాకం న్యూస్:** విద్యార్థులకు అందించే ఆహారం రుచిగా, పోషక విలువలు కలిగి నాణ్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను అమలు చేయాలని, ఇందులో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, నాణ్యత లోపించినా సంబంధిత అధికారులపై, ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని విద్యా సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం, ముస్తాబు కార్యక్రమ పురోగతిని ఆయన స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును స్వయంగా పర్యవేక్షించిన ఆయన వంటశాలలను సందర్శించి, భోజనం తయారీలో వాడుతున్న వస్తువుల నాణ్యతను, పరిశుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతుందో లేదో ఆరా తీశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి అని, ముస్తాబు అమలును పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని డిజిటల్ తరగతి గదులను కలెక్టర్ సందర్శించారు. స్మార్ట్ బోర్డుల ద్వారా పాఠ్యాం శాలను బోధించే విధానాన్ని పరిశీలించి, విద్యార్థుల విజ్ఞాన స్థాయిని పరీక్షించారు. పలువురు విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి ప్రతిస్పందనను గమనించారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలని దిశా నిర్దేశం చేశారు. అనంతరం జెసి, మున్సిపాల్టీ ప్రత్యేకాధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పాఠశాల రికార్డులను, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. విద్యార్థుల చేతులను పరిశీలించి, మెనూ అమలు పట్ల ఆరా తీశారు. ఈ తనిఖీలో మున్సిపల్ అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్అనంతరం పట్టణంలోని సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పనితీరును, సిబ్బంది హాజరును స్వయంగా పర్యవేక్షించారు. సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా మరియు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కార స్థితిగతులను కలెక్టర్ పరిశీలించారు. కంప్యూటర్ రికార్డులను, ఆన్‌లైన్ సేవలను కూడా ఆయన తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సచివాలయ సిబ్బంది నిర్ణీత సమయానికి కార్యాలయానికి రావాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## మెప్మా కార్యాలయం వద్ద ఆర్పీల ధర్నా



**విజయనగరం, పతాకం న్యూస్:** విజయనగరం పట్టణంలో జొన్న గుడ్డిలో పనిచేస్తున్న ఆర్పి జయలక్ష్మి పని ఒత్తిడి కారణంగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఆర్పీల యూనియన్ ఆధ్వర్యంలో మెప్మా ఆఫీసు వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్పీల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్ ఝాన్సీ, విశాఖపట్నం సిఐటియు ఆర్పీల నాయకులు పి మనీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి లక్ష్మి మాట్లాడారు. విజయనగరం జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఆర్పీలు రోజుకోక కొత్త యాప్‌ను తీసుకురావడంతో పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. మంగళవారం సాయంత్రం జొన్న గుడ్డి లో పనిచేస్తున్న ఆర్పి జయలక్ష్మి హార్ట్ ఎటాక్ తో మరణించారన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యని మండిపడ్డారు. ఒక యాప్ తీసుకొచ్చి రెండు రోజుల్లో టార్గెట్ పెట్టి పని చేయమని ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీర్లు చేయాల్సిన పనిని టెన్త్ క్లాస్ చదువుకున్న ఆర్పీలకు ఎటువంటి ట్రైనింగ్ ఇవ్వకుండా టైం లిమిట్ పెట్టి పని చేయించడం వలన ఆర్పి జయలక్ష్మి చనిపోయిందన్నారు. మరొక ఆర్పి 18 వ వార్డు ఐ కోనేరు గట్టు పరిధిలో పనిచేస్తున్న ఎంఎస్ రూప హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. మృతి చెందిన జయలక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని, యాప్‌ల భారం , పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అర్పిలకి నాలుగు నెలలుగా జీతాలు బకాయిలు ఉన్నాయని అన్నారు.

## రూ. 490 కోట్లతో అభివృద్ధి: మంత్రి సంధ్యారాణి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** సాలూరు నియోజకవర్గాన్ని రూ.490 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ నిధులతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసే దిశలో అంతా కలిసి ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాదిద్దామని, ఇందుకోసం ఇతర పార్టీలను కూడా ఆహ్వానిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అత్యాధునిక మిషనరీ ద్వారా తడి, పొడి చెత్తను వేరుచేసే యంత్రాన్ని స్విచ్ ఆన్ చేసి మంత్రి ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌లో జరుగుతున్న చెత్త వేరుచేసే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుండి సంపద సృష్టించే ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. గత ఐదేళ్లలో పక్కన పడేసిన టన్నుల కొద్దీ చెత్తను ఇప్పుడు అత్యాధునిక మిషనరీ ద్వారా తడి, పొడి చెత్తగా విడదీస్తున్నామని, ఇందులో నుంచి ప్లాస్టిక్‌ను వైజాగ్ తరలిస్తున్నామని, మట్టిని ల్యాండ్ ఫిలింగ్ కోసం వినియోగిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు సాలూరు మున్సిపాలిటీ చెత్త నిర్వహణలో ఆదర్శంగా ఉండేదని, గతంలో ఇక్కడి డంపింగ్ యార్డ్‌లోనే మున్సిపల్ కమిషనర్ తన కుమార్తె వివాహం జరిపించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఈ మునిసిపాలిటీ గతంలో ఎన్నో అవార్డులను సొంతం చేసుకుందని అన్నారు. అనంతరం చెత్తను సేకరించే డబ్బాలను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, జాయింట్ కలెక్టర్, మునిసిపల్ ప్రత్యేక అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, కమిషనర్, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.6వేల మందితో 22న భారీ కోలాటం ప్రదర్శన గిరిజనసంస్కృతి, సాంప్రదాయా లను విశ్వవ్యాప్తం చేసే లక్ష్యంతో మన్యం జిల్లాలో ఈ నెల 22న భారీ స్థాయిలో కోలాట ప్రదర్శనను నిర్వహించనున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజన విద్యార్థులు 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలు చేసిన రికార్డు స్ఫూర్తితో, ఇప్పుడు మన జిల్లాలో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. సాధారణంగా 20 నుండి 40 మందితో చేసే కోలాటాన్ని ఈసారి వేల మంది విద్యార్థులతో ప్రదర్శించి ఒక కొత్త రికార్డును సృష్టించడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశ్యమన్నారు. ఈ కోలాటంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇందులో భాగస్వాములు అవుతారని, ఆసక్తి గల వారు ఐటిడిఎ, కలెక్టర్ కార్యాలయంలో గాని తమ పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలిపే ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

## 'ఉపాధి' పనుల్లో ఫేస్ యాప్ రద్దు చేయాలి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** : పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం గొర్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద బుధవారం గిరిజనులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు మెల్లక చక్రపాణి మాట్లాడుతూ ఫేస్ యాప్ అమలు కారణంగా కూలీలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పనికి హాజరై పని చేసినప్పటికీ యాప్‌లో హాజరు నమోదు కాకపోవడంతో కూలి అందకుండా పోతుందని ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా వందలాది మంది కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధి కూలి లేక, వ్యవసాయ పనులు కూడా లేక ప్రజలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానాలను రద్దు చేసి పాత పద్ధతుల్లోనే ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పని హక్కును గ్యారెంటీ చేయాలని కోరారు. గ్రామసభల ద్వారా పనులను గుర్తించాలనీ, వేసవి అలవెన్సులు 40 శాతం చెల్లించాలని, రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. పనుల వద్ద తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని, మేట్లకు ప్రోత్సాహకాలు, పనిముట్ల నిర్వహణకు అదనపు భత్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఆదాయానికి మించిన ఆస్తులు... దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి అరెస్ట్



**విజయవాడ, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కాళింగిరి శాంతిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఆమె నివాసంతో పాటు పలు ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో భారీగా అక్రమాస్తులు బయటపడటంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. శాంతిని విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఏప్రిల్ 21 వరకు రిమాండ్ విధించారు. దాంతో ఆమెను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. తాడేపల్లి, ఉండవల్లితో పాటు మొత్తం నాలుగు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేపట్టారు. సుమారు ఆరు గంటల పాటు సాగిన ఈ సోదాల్లో విశాఖపట్నం ఎండాడలో ఒక విలాసవంతమైన ఫ్లాట్, తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జీం2 భవనాన్ని గుర్తించారు. వీటితో పాటు 770 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి వస్తువులు, రూ.1.15 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో మరో రూ.3 లక్షలు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం ఉన్నట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. కాళింగిరి శాంతి గతంలోనూ పలు వివాదాలతో వార్తల్లో నిలిచారు. అక్రమాల ఆరోపణల కారణంగా గత ఏడాది జులై నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఆమె సస్పెన్షన్‌లో ఉన్నారు. హైకోర్టు ఆదేశాలతో ఇటీవలే ఆమెను విధుల్లోకి తీసుకున్నారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి పేరుతో ముడిపడి పలు ఆరోపణలు రాగా, వాటిని ఆమెతో పాటు విజయసాయిరెడ్డి కూడా ఖండించడం తెలిసిందే.

# మూడు చోరీ కేసుల్లో ఒకరి అరెస్టు



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలస కుమ్మరి వీధితోపాటు మరో రెండు దేవాలయాల్లో బంగారం, వెండి వస్తువుల చోరీకి సంబంధించి ఒక నిందితుడను అరెస్టు చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని కొత్తవలస సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన కొత్తవలస పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస కుమ్మరి వీధిలో నివాసం ఉంటున్న శ్రీకాకుళం శ్రీను అనే వ్యక్తి ఇంట్లో గత నెల 31న ఏడున్నర తులాల బంగారంతో పాటు 15 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు శ్రీను కుమారుడు శేషు ఫిర్యాదు చేశారు. అలాగే గత సంవత్సరం డిసెంబర్ నెలలో మంగళపాలెం గ్రామానికి చెందిన శివాలయంతో పాటు జనవరి నెలలో కొత్తవలస దుర్గాదేవి ఆలయంలోనూ చోరీలు జరిగాయి. ఈచోరీలకు సంబంధించి కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేయగా.. ఈ దొంగతనాలకు పాల్పడింది కొత్తవలస ఎస్సీ కాలనీకి చెందిన మైలపల్లి సంతోష్‌కుమార్ అలియాస్ ఎర్నిబాబు అలియాస్ చేపలోడు అనే వ్యక్తిగా గుర్తించి, పోలీసులు పట్టుకున్నారు. అతడిని ప్రశ్నించగా తనతో పాటు మరో ఇద్దరు కలిసి ఈ చోరీలు చేసినట్టు నేరం అంగీకరించాడు. ఈ కుమ్మరి వీధిలో జరిగిన చోరీకి సంబంధించి ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండితో పాటు, ఆలయాల్లో చోరీకి సంబంధించి 90 గ్రాముల వెండి వస్తువులు, మరో రెండు తులాల బంగారు ఆభరణాలను నిందితుల నుంచి పోలీసులు రికవరీ చేశారు. ఈ చోరీ సొత్తు విలువ సుమారు రూ.17లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. అలాగే కొత్తవలస -సబ్బవరం రోడ్డులోని వైద్యుడు తెన్నేటి సుబ్బారావు ఇంట్లో జరిగిన దొంగతనంపై దర్యాప్తు ముమ్మరం చేశామని సీఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జోగారావు, ప్రసాదరావు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ గోడౌన్‌లో చెలరేగిన మంటలు



**నల్లజర్ల, పతాకం న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా మండల ప్రధాన కేంద్రమైన నల్లజర్లలో బుధవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో మందుల గోడౌన్ లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో సుమారు 15 లక్షల రూపాయలు విలువైన మందులు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు గంటల 20 నిమిషాల ప్రాంతంలో డ్యూటీ నర్స్ ప్రసన్న మంటలను గమనించి వెంటనే అప్రమత్తమై డాక్టర్ మహమ్మద్ సిరాజుద్దీన్ కు సమాచారం అందించి చుట్టుపక్కల ప్రజలను అప్రమత్తం చేశారు. దగ్గరలో ఉన్న 108 సిబ్బంది హాస్పటల్ సిబ్బంది వెను వెంటనే అగ్నిమాపక కేంద్రానికి. ఎలక్ట్రికల్ సిబ్బందికి సమాచారం అందించి. అనంతరం స్థానికంగా ఉన్న బకెట్లతో నీళు చల్లి మంటలను అదుపులోనికి తెచ్చే ప్రయత్నం చేశారు. తాడేపల్లిగూడెం నుంచి ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కు సమాచారం అందించగా వెంటనే ప్రజలకు వినియోగించే అత్యవసర మందులను తక్షణమే ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్ సిరాజ్ ఉద్దీన్. సిబ్బంది ప్రసన్న. రాష్ట్ర వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జి వి ప్రసాద్. ఫార్మసిస్ట్ రేవతి. కంజెంట్ వర్కర్ లక్ష్మి. సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు కాసుల పంట కురిపిస్తున్న 'చింతపండు'



**పార్వతీపురం, పతాకం న్యూస్:** ఈ ఏడాది ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు కాసుల పంట పండుతోంది. చింతపండు దిగుబడి గణనీయంగా తగ్గిపోయినా ధర మాత్రం ఆశాజనకంగా పెరుగుతోంది. గిరిజనులు గతంలో ఎన్నడూ చూడని విధంగా చింతపండు రేటు కిలో వంద రూపాయలకు చేరువలో ఉంది. ప్రస్తుతం మార్కెట్లో నాణ్యమైన చింతపండు కిలో ధర 90రూపాయల వరకు పలుకుతోంది. మరి కొద్దిరోజుల్లో ఇది వంద రూపాయలు దాటే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో ఈ ఏడాది సీజన్‌లో చింతపండు దిగుబడి ఆశాజనకంగా లేదు. దీంతో మార్కెట్లో ధర అమాంతంగా పెరుగుతూ వస్తోంది. గత ఏడాదిలో దిగుబడి ఎక్కువగా ఉండడంతో కిలో చింతపండు రూ.60 దాటలేదు. ఈ ఏడాది పంట దిగుబడి తగ్గడంతో ధర పెరుగుదల గిరిజనులకు కాసుల పంట కురిపిస్తోంది. పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయినా ధర మాత్రం రికార్డు స్థాయిలో పెరగడం ఏజెన్సీ వాసుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.రెండు సార్లు ధర పెంచిన జిసిసిచింతపండు సీజన్ ప్రారంభానికి ముందు జిసిసి చింతపండు కిలో ధర రూ.36గా నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన చిన్న తరహా ఉత్పత్తుల ధరలకు అనుగుణంగానే జిసిసి మొదటగా కిలో ధర రూ.36గా ప్రకటించింది. అయితే అప్పటికే మార్కెట్లో ధర రూ.60 పలుకుతుండడంతో అనివార్యంగా జిసిసి యాజమాన్యం కూడా రూ.45 వరకు పెంచింది. ప్రస్తుతం మార్కెట్లో ధర రూ.90 వరకు చేరడంతో జిసిసి మరో అడుగు ముందుకు వేసి రూ.55గా నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.36లైనా జిసిసి మాత్రం మరో రూ.19 పెంచింది. జిసిసి గిరిజనులకు మార్కెట్లో మరింత గిట్టుబాటు ధర లభించాలనే ఉద్దేశంతో 55 రూపాయల వరకు ధర పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజనులు జిసిసికి చింతపండు విక్రయించకపోయినా ఫర్వాలేదని, దళారుల వలలో పడి నష్టపోకుండా రెండు సార్లు ధర పెంచింది. ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి సూచనల మేరకు జిసిసి ఎమ్‌డి ఎస్ఎస్ శోబిక సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే జిసిసి అధికారులు, సిబ్బంది సంతల్లో అటవీ ఉత్పత్తుల అమ్మకాల్లో గిరిజనులు మోసం పోకుండా అవగాహన కల్పించారు.పక్క రాష్ట్రాల నుంచి దిగుమతిఏపిలో చింతపండు దిగుబడి గణనీయంగా తగ్గడంతో పక్క రాష్ట్రాల నుంచి అధికంగా దిగుమతి జరుగుతోంది. రాష్ట్రంలో ప్రజలు, విద్యాసంస్థల అవసరాలకు అనుగుణంగా దిగుబడి లేకపోవడంతో వ్యాపారులు గిరిజన గ్రామాలకు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి ఎక్కువగా దిగుమతి చేస్తున్నారు. నాణ్యమైన కిలో చింతపండు ధర మార్కెట్లో ప్రస్తుతం రూ.90కు చేరింది. మున్ముందు ఇది వంద రూపాయలు దాటే పరిస్థితి కనిపిస్తోంది. వ్యాపారులు ఇప్పటికే వేలాది టన్నులు కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజ్ ల్లో నిల్వ చేస్తున్నారు. చింతపండుకి ఈ ఏడాది డిమాండ్ బాగా పెరుగుతుందనే ఆశతో ఎక్కువ మొత్తంలో నిల్వ చేస్తున్నారు. గిరిజనుల మేలు కోసం ధర పెంపు ఈఏడాది సీజన్ ప్రారంభానికి ముందు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కిలో 36 రూపాయలు. ఆ ధర ప్రకారం జిసిసి కొనుగోలు ప్రారంభించింది. అయితే మార్కెట్లో ధర పెరుగుతున్న నేపథ్యంలో మొదటిసారి 45 రూపాయల వరకు పెంచాం. ఇంకా మార్కెట్లో ధర 90 రూపాయల వరకు చేరడంతో రెండో సారి రూ.55గా నిర్ణయిస్తూ జిసిసి ఎమ్‌డి ఎస్ ఎస్ శోబిక ఉత్తర్వులు జారీ చేశారు. ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి సిఫార్సు మేరకు ధర పెంపు జరిగింది. సంస్థ ప్రయోజనాల కన్నా గిరిజనుల ప్రయోజనాలే పరమావధిగా భావించి యాజమాన్యం రెండు సార్లు ధర పెంచింది.

# ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సౌర విద్యుత్



**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద డెంకాడ మండలంలోని ఎస్సి కాలనీలో రెండు 2 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ ,మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మంగళవారం ప్రారంభించారు. ఈ ప్లాంట్లను లబ్ధిదారులు సిహెచ్. రాంబాబు, శ్రీ సిహెచ్. లక్ష్మణ గార్ల ఇళ్ల వద్ద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఎమ్‌డి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాకుండా వినియోగదారులకు విద్యుత్ బిల్లుల్లో గణనీయమైన ఆదా కలుగుతుందని తెలిపారు. ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.75,021 కోట్ల సబ్సిడీని కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని విస్తృతంగా అమలు చేస్తూ, ఎస్సి, ఎస్టి వినియోగదారుల కోసం యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ విధానంలో 2 కిలోవాట్ల సౌర రూఫ్‌టాప్ ప్లాంట్లను ఉచితంగా ఏర్పాటు చేస్తోందన్నారు. జిల్లాలో మొత్తం 50,946 ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులలో మొదటి విడతగా 15,018 మందికి రూ.170.48 కోట్ల వ్యయంతో 30.04 మెగావాట్ల సౌర రూఫ్‌టాప్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జగ్జీవన్ జ్యోతి యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ప్రతి నెల 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 5089 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ఉండగా, మొదటి విడతగా 1443 మందికి 2.866 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.16.29 కోట్ల రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. తీరప్రాంత గ్రామాల వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. డెంకాడ గ్రామంలో 21 సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడానికి ఎస్సి, ఎస్టి కుటుంబాలు ముందుకు వచ్చాయన్నారు. మండలంలో 246 కుటుంబాలు ఈ ఉచిత సోలార్‌కు ముందుకు వచ్చాయని వీటిలో 128 కుటుంబాలకు సోలార్ ప్యానల్ బిగించామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, రూరల్ ఎస్ఇ ఆపరేషన్ జి.సురేష్ బాబు, డిఇ ఆపరేషన్ భోగాపురం సిహెచ్ మాధవ నాయుడు, ఎఇ అప్పలస్వామినాయుడు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసి కందిసూర్యనారాయణ, టిడిపి నాయకులు పాణిరాజు, జనసేన రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మిలక్ష్మీ రాజ్, మండల జనసేన కోఆర్డినేటర్ పైలశంకర్, జనసేన నాయకుడు సిరి అప్పారావు విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గోబర్ గ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు రైతుల ఆసక్తి



**చోడవరం, పతాకం న్యూస్:** పశ్చిమాసియాలో ఐదు వారాల నుంచి జరుగుతున్న యుద్ధం ప్రభావం వంట గ్యాస్ సరఫరాపై పడడంతో గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ గోబర్ గ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నామమాత్రపు ఖర్చుతో వంట గ్యాస్ ఉత్పత్తి అవుతుండడంతో పశు పెంపకందారులు మొగ్గు చూపుతున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు గ్రామీణ ప్రాంతంలో రైతుల ఇళ్ల వద్ద ప్రత్యేకంగా గోబర్ గ్యాస్ ప్లాంటు ఉండేవి. అప్పట్లో పెట్రోలియం కంపెనీల వంట గ్యాస్ ఏజెన్సీలు కేవలం పట్టణాల్లో మాత్రమే వుండడంతో, గ్యాస్ కనెక్షన్ కోసం నెలలు, సంవత్సరాల తరబడి వేచివుండాల్సి రావడంతో చాలా మంది గోబర్ గ్యాస్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధిలో భాగంగా గోబర్ గ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వరంగ సంస్థ అయిన నెడ్‌క్యాప్ భారీ ఎత్తున సబ్సిడీ ఇచ్చింది. దీంతో పశువులు వున్న రైతుల్లో ఎక్కువ మంది ఈ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు చాలా గ్రామాల్లో రైతులు గోబర్ గ్యాస్ ప్లాంట్లను ఉపయోగించారు. అయితే గోబర్ గ్యాస్ ఉత్పత్తి కోసం రోజూ పశువుల పేడలో నీరు కలిపి, చేతులతో బాగా కలియబెట్టి యూనిట్‌లో పోయాల్సి వచ్చేది. ఇందుకోసం కొంతసమయం కేటాయించాలి. అయితే సుమారు రెండు దశాబ్దాల నుంచి మండల కేంద్రాల్లో కూడా గ్యాస్ ఏజెన్సీలు ఏర్పాటు కావడం, దరఖాస్తు చేసిన వెంటనే గ్యాస్ కనెక్షన్ ఇస్తుండడం, ఇదే సమయంలో దీపం పథకం కింద ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంతో మారుమూల గ్రామాల్లో సైతం ఎల్‌పీజీ సిలిండర్ల వినియోగం పెరిగింది. దీంతో గోబర్ గ్యాస్ ప్లాంట్లు ఒక్కొక్కటిగా మూలకుచేరాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి చివరి రోజున ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం మొదలుపెట్టాయి. దీంతో గల్ఫ్ దేశాల నుంచి ఎల్‌పీజీ దిగుమతి తగ్గింది. యుద్ధం ప్రభావంతో వాణిజ్య అవసరాల గ్యాస్ సరఫరాలో భారీ ఎత్తున కోత విధించింది. గృహ వినియోగ సిలిండర్లు సైతం బుక్ చేసిన రెండు, మూడు వారాల తరువాతే డెలివరీ చేస్తున్నారు. దీంతో రైతుల చూపు మళ్లీ గోబర్ గ్యాస్ ప్లాంట్లపవైపు మళ్లింది. గోబర్ గ్యాస్ యూనిట్ల ఏర్పాటు కోసం ప్రభుత్వ అధికారులను సంప్రదిస్తున్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం



**కర్నూలు, పతాకం న్యూస్:** డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ అన్నారు. ఈగల్ సెల్ ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ హాజరై డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో డ్రగ్స్‌ను పారద్రోలుదామని ఆర్టీసీ డ్రైవర్లచే ప్రతిజ్ఞ చేయిం చారు. అనుమానాస్పద పార్సిల్స్ లేదా వ్యక్తులు ఉంటే వెంటనే 1972కు సమాచారం అందించాలన్నారు. యువతను డ్రగ్స్ నుంచి దూరంగా ఉంచేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ ఎలిషా, ఆర్టీసీ ట్రైనింగ్ కాలేజీ ఇనచార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణ, కర్నూలు, అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాలకు చెందిన సీనియర్ ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఉచిత సోలార్ విద్యుత్ పథకం ప్రారంభం

**రామచంద్రపురం, పతాకం న్యూస్:** మండలంలోని చోడవరం గ్రామంలో ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని కాంద్రకోట మంగయ్యమ్మ, బూర కుమారిల గృహాలపై ఏర్పాటుచేసిన పిఎం సూర్యఘర్ సోలార్ పలకలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెను కబడిన తరగతుల ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత విద్యుత్తును అందించేందుకు, అదనంగా ఉత్పత్తి అయిన విద్యుత్తును గ్రిడ్‌కు విక్ర యించడం ద్వారా కొంత ఆదాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2 కిలోవాట్ల సోలార్ సిస్టమ్‌పై భారీ రాయితీ రూ.1లక్షా65 వేల వరకు లభిస్తుందన్నారు. ఎస్‌సిలకు, ఎస్‌టిలకు ఈ మొత్తాన్ని ప్రభు త్వమే చెల్లిస్తుందన్నారు. సొంత ఇల్లు ఉండి, పైకప్పు పై సోలార్ ప్యానెల్స్ అమర్చడానికి అనువుగా ఉండాలన్నారు. దరఖాస్తుదారుడి పేరు మీద చెల్లుబాటు అయ్యే విద్యుత్ కనెక్షన్, ఆధార్ కార్డు. కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు ఉండాలన్నారు. దరఖాస్తు చేసిన ఇల్లు సోలార్ ఏర్పాటుకు అను కూలంగా ఉందో లేదో తనిఖీ చేసి అనుమతి ఇస్తారన్నారు. ప్రభుత్వం గుర్తించిన రిజిస్టర్డ్ వెండర్ల ద్వారా మాత్రమే ప్యానెల్స్ అమరుస్తారన్నారు. ఇన్స్టాలేషన్ పూర్తయ్యాక, డిస్కం నెట్ మీటర్ అమర్చు తారని అన్నారు. 2 కిలోవాట్ల సిస్టమ్ ద్వారా నెలకు 240 నుంచి 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అన్నారు. ఇది ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబాల అవసరాలకు సరిపోతుందన్నారు. రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసినందుకు నెలకు రూ.200 అద్దెగా ప్రభుత్వం చెల్లిస్తుందని వివరించారు.

## అదుపుతప్పి కాలువలోకి
## దూసుకెళ్లిన కారు.. ఇద్దరి మృతి



**తూర్పు గోదావరి, పతాకం న్యూస్:** మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాపేశ్వరం శివారు పేకేటిపాకలు వద్ద ఓ కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు భార్యాభర్తలు మృతి చెందారు. కాకినాడ నుంచి వెలగతోడు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు నడుపుతున్న బోగిల్లి వీర వెంకట సతీష్ (40), ఆయన భార్య బోగిల్లి కిరణ్మయి (36) నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. కారు కాలువలోకి దూసుకెళ్లిన వెంటనే అక్కడకు చేరుకున్న గ్రామస్తులు అందులోని వ్యక్తులను కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే భార్యాభర్తలు చనిపోగా.. కారు వెనుక సీట్లో ఉన్న వృద్ధ దంపతులు, ఇద్దరు చిన్నపిల్లలను రక్షించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తికి సహకరించండి

**కడప, పతాకం న్యూస్:** విశ్వనాథపురం వద్ద పెండింగ్లో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, రైల్వే అండర్ బ్రిడ్జి సాధన కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డిఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ, పరిహారం సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎర్రముక్కపల్లి నుంచి విశ్వనాథపురం వైపు వెళ్లేందుకు ప్రధాన రహదారి పెండింగ్లో ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 35 గ్రామాలకు చెందిన ప్రజలు దాదాపు 50 వేల మంది ఈ రాకపోకలు సాగించే అవకాశం ఉందన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రైల్వే అండర్ బ్రిడ్జి పూర్తి చేసేందుకు భూసేకరణ పరిహారం త్వరగా చెల్లించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## గిట్టుబాటు ధర లేక పొలంలోనే
## టమోటను వదిలేస్తున్న రైతులు



**కర్నూలు, పతాకం న్యూస్:** టమోటా దరలు ఒక్కసారిగా పడిపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత డిసెంబరులో 25 కేజీల బాక్సు రూ.800 నుంచి రూ.వెయ్యి పలికింది. అయితే ప్రస్తుతం 25 కేజీల బాక్సు రూ.వందకే పరిమితం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. టమోటా సాగుచేయడానికి ఎకరాకు రూ.1.5లక్షలు ఖర్చవుతుందని రైతులు అంటున్నారు. ఇందులో నారు దగ్గ నుంచి కూలీలు, ఎరువులు, పురుగుమందుల ఖర్చులు ఉన్నాయి. సాధారణంగా ఎకరాకు 25 బాక్సులు పైనే దిగుబడి రావాల్సి ఉండగా ఇప్పుడు కేవలం 7 నుంచి 10 బాక్సులు మాత్రమే వచ్చినట్లు రైతులు వాపోతున్నారు. మండలంలోని కొలుములపేట గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున్‌రెడ్డి ఎకరం పొలంలో సాగుచేసిన టమోటాలను పొలంలోనే వదిలేశారు. దిగుబడి తగ్గి ధర లేకపోవడంతో చేసేదేమీలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాయలు కోసే కూలీలకు కూడా డబ్బు వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ప్రభుత్వం స్పందించి, గిట్టుబాటు ధర కల్పించాలని లేదా ప్రభుత్వమే కొనుగోలుచేయాలని రైతులు కోరుతున్నారు.

## ఖరీఫ్‌కు విత్తన ప్రణాళిక సిద్ధం

**అనంతపురం, పతాకం న్యూస్:** ఖరీఫ్ 2026 కు అవసరమైన సబ్సిడీ విత్తనాన్ని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎం. రవి ఏపీ సీడ్స్ అధికారులు, సరఫరాదారులతో బుధవారం స్థానిక జెడిఎ కార్యాలయంలో ఖరీఫ్ 2026 విత్తన ప్రణాళిక, సరఫరా పై జిల్లా వ్యవసాయ అధికారి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఎం. రవి మాట్లాడుతూ.. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్-2026 కు 56 వేల 423 క్వింటాళ్ల వేరుశనగ, 60 క్వింటాళ్ల పెసలు, 759 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 60 క్వింటాళ్ల కొర్రలు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. ఏపీ సీడ్స్ అధికారులు, విత్తన సరఫరాదారులు ఖరీఫ్ -2026 నిబంధనలుకు అనుగుణంగా ఖరీఫ్ సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు సిద్ధం చేసి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ సీడ్స్ అధికారులును, సరఫరా దారులను జిల్లా వ్యవసాయ అధికారి ఎం. రవి ఆదేశించారు.

# మహిళల్లో PCOD/PCOS సమస్యలు-కారణాలు

## SJS ఆయుర్వేద వైద్య నిలయం.. పరిష్కారాలు మార్గాలు, నియమాలు

నేటి ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల చాలా మంది మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య PCOD (Polycystic Ovarian Disease). దీనివల్ల నెలసరి సరిగ్గా రాకపోవడమే కా కుండా భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

**PCOD రావడానికి ప్రధాన కారణాలు:**

హార్మోన్ల అసమతుల్యత: శరీరంలో ఆండ్రోజెన్ (మగ హార్మోన్లు) స్థాయి పెరగడం.

ఇన్సులిన్ రెసిస్టెన్స్ : శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించే ఇన్సులిన్ సరిగ్గా పనిచేయకపోవడం.

అధిక ఒత్తిడి : మానసిక ఆందోళన మరియు తగినంత నిద్ర లేకపోవడం.

జంక్ ఫుడ్ : ప్రాసెస్ చేసిన ఆహారం మరియు అధిక చక్కెర వినియోగం.

**భవిష్యత్తులో వచ్చే సమస్యలు**

సకాలంలో చికిత్స తీసుకోకపోతే వంధ్య త్వం (సంతానలేమి), టైప్-2 డయా బెటిస్, గుండె సంబంధిత సమస్యలు మరియు గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

**మొదటి పరిష్కారం మన ఆరోగ్యం**
**మన వంటింట్లో ఉంది ఆ మార్గం చూద్దాం**

బూడిద గుమ్మడి కాయ ముక్క 100గ్రాము దాల్చిన చెక్క రెండు, 20 గ్రాముల అల్లము, నాలుగు తమలపాకులు, 10 గ్రాముల సోంపు జీలకర్ర కలిపి జ్యూస్ లాగా తయారు చేసుకుని ప్రతిరోజు



ఉదయం సూర్య నమస్కారాలు చేసిన తర్వాత ఏడు గంటలకు సైశీదక లవణం సాల్ట్ కలుపుకొని తాగవలెను.

ముఖ్యమైన మూలికలు: రెండో రకం మూలికలు.

1.శతావరి: హార్మోన్లను మరియు ఋతు చక్రాలను నియంత్రిస్తుంది.

2.-అశ్వగంధం: ఒత్తిడిని తగ్గించి పునరుత్పత్తి వ్యవస్థను బలపరుస్తుంది.

3.-గుడుచి (తిప్పతీగ): ఇన్సులిన్ సెన్సి టివిటీని మెరుగుపరుస్తుంది.

4హరిద్రా (పసుపు): శరీరంలోని వాపును మరియు హార్మోన్ల దోషాలను తగ్గిస్తుంది.

**జీవనశైలి మార్పులు - మీ ఆరోగ్యం మీ చేతుల్లో :**

ఆహారం : తృణధాన్యాలు, పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి. ఒమేగా-3 కోసం అవిసె గింజలు, వాల్ నట్స్,బ్లూ బెర్రీస్,గుమ్మిడికాయ గింజలు వాడాలి.



ఓపెన్ ఛాలెంజ్

**డాక్టర్ శ్రీనివాస్ లెక్కల**

ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు

మీ ఆరోగ్యమే మా లక్ష్యం!

**SJS ఆయుర్వేదం, వైజాగ్**

ఫోన్ నెంబర్: 9112311114

నెలసరి, అధిక బరువు లేదా మొటిమల సమస్య ఉంటే వెంటనే మమ్ములను సంప్రదించండి.

వ్యాయామం: ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల వాకింగ్ లేదా యోగా (సూర్య నమస్కారాలు) చేస్తూ ఉండాలి.

నిద్ర:రాత్రివేళ ప్రతి మనిషి సగుటున 7-8 గంటల ప్రశాంతమైన నిద్ర చాలా అవసరం.

నివారించవలసినవి : ప్యాకెట్ ఫుడ్స్, కూల్ డ్రింక్స్,పాలు,చికెన్,బార్లీ, చాకోలెట్స్, నూడిల్స్, అధిక కెఫిన్, జీవితంలో ఎప్పటికీ తినకుండా ఉండగలిగితే మరియు ధూమపానం మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే.

## అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం



**ఇరాన్:** ఇరాన్‌తో ఒప్పందం కోసం విధించిన గడువును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో రెండు వారాలు పొడిగించారు. అలాగే రెండు వారాలపాటు దాడులు నిలిపివేయనున్నట్లు ప్రకటించారు. రెండురోజుల గడువు ముగియటానికి దాదాపు రెండు గంటల ముందు ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. ట్రంప్ తాజా నిర్ణయంతో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భయాలకు తాత్కాలికంగా తెరపడింది. అటు ఇజ్రాయెల్ కూడా రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకారం తెలిపింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌లు తనతో చర్చలు జరిపారని, ఇరాన్‌పై దాడులు నిలిపివేయాలని తనను కోరారని ట్రంప్ తెలిపారు. అలాగే, హర్మూజ్ జలసంధిని పూర్తిగా, తక్షణమే, సురక్షితంగా తెరవడానికి ఇరాన్ అంగీకరించాలనే షరతుకు లోబడి, రెండు వారాలపాటు దాడులను నిలిపివేయడానికి అంగీకరించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇది ఇరువైపులా వర్తించే కాల్పుల విరమణ అవుతుందని ట్రంప్ తెలిపారు. ఇప్పటికే సైనిక లక్ష్యాలను తాము దాదాపు చేరుకోవడం వల్ల కూడా ఈ నిర్ణయం తీసుకోవటానికి మరో కారణమని ట్రంప్ వెల్లడించారు. అంతర్జాతీయ నౌకల రవాణాకు కీలకమైన హోర్మూజ్ జలసంధికి పూర్వపు హోదా తిరిగి ఇచ్చే ప్రశ్నే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ యుద్ధానికి ముందున్న పరిస్థితి మళ్లీ రాదని పేర్కొంది. ఇతర దేశాల నౌకల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేదని, తమ శత్రు దేశాల నౌకలకు మాత్రం ఎలాంటి అనుమతినిచ్చే ప్రశ్నే లేదని తేల్చి చెప్పింది. మార్చడానికి వీల్లేని కొన్ని వ్యూహాత్మక మార్పులు చేపట్టామని తెలిపింది. ఈ మేరకు ఐఆర్‌జిసి నేవీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ జలసంధిపై విదేశీ గుత్తాధిపత్యం శకం ఇక ముగిసిందని వ్యాఖ్యానించింది. ఇటీవల జరిగిన ప్రాంతీయ పరిణామాలు కొత్త వాస్తవికతను నెలకొల్పాయని, ఆ నేపథ్యంలో ఇక ఇరాన్ సమీప సముద్ర జలాల్లో అమెరికా తన షరతులు, నిబంధనలు నిర్దేశించలేదని తేల్చి చెప్పింది.

# క్రీడా పాఠశాల ప్రారంభమయ్యేనా?

## మధ్యలో నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం



**విజయనగరం, పతాకం న్యూస్:** క్రీడలు జిల్లాగా ఖ్యాతి గాంచిన విజయనగరం విజ్జీ మైదానంలో మూతపడిన క్రీడా పాఠశాలను ఏడాదిలోగా తెరిపిస్తామని ఎమ్మెల్యే పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు ఇచ్చిన వాగ్దానానికి రెండేళ్ల అవుతుంది. క్రీడా పాఠశాల ప్రారంభం కాగపోగా మధ్యలో నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేయడంలో కూడా అధికార కూటమి పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో విజయనగరంలో ఉన్న క్రీడా పాఠశాలను అప్పటి వైసిపి ప్రభుత్వం మూసేసిన విషయం తెలిసిందే. 2024 లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం క్రీడా పాఠశాలను తెరిపిస్తామని చెప్పి రెండేళ్ల అవుతున్న అమలు కాకపోవడంతో క్రీడాకారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అసలు పాఠశాల ప్రారంభం అవుతుందా అనే సందేహం క్రీడాకారుల్లో వ్యక్తమవుతోంది.దిష్టిబొమ్మలా భవన నిర్మాణాలు కోట్లాది రూపాయలతో మూడంతస్తుల భవన నిర్మాణాలు ప్రారంభమై రెండు ప్రభుత్వాలు మారిపోయాయి. పదేళ్లయినా భవన నిర్మాణాలు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మరో వైపు భవన నిర్మాణం పూర్తి చేసేందుకు గత ఏడాది రూ.5 కోట్లు కావాలని, నిర్వహణ కోసం మరో రెండు కోట్లు కావాలని అప్పటి కలెక్టర్ అంబేద్కర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాటికి ఏడాది కావస్తున్న నేటికి పైసా కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు.దీంతో భవన నిర్మాణ పనులు జరగక దిష్టిబొమ్మలా విజ్జి మైదానంలో కనిపిస్తుంది. మరో వైపు 2026 విద్యా సంవత్సరం జూన్ నెలల్లో క్రీడా పాఠశాల ప్రారంభం చేస్తామని చెప్పిన మాటలు నెరవేరేటట్లు కనిపించడం లేదు. మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు కనీసం క్రీడా పాఠశాల ఊసే ఎమ్మెల్యే గాని, ప్రభుత్వం గాని ఎత్తలేదు. మరో వైపు నిధులు కూడా మంజూరు చెయ్యలేదు. దీంతో ఈ ఏడాది కూడా క్రీడా పాఠశాల ప్రారంభమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యమంత్రిని కలవనున్న ఎమ్మెల్యే అదితి క్రీడా పాఠశాల విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే పూసపాటి అతిధి విజయలక్ష్మి గజపతిరాజు కలవనున్నట్లు తెలిసింది. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగా క్రీడా పాఠశాల ప్రారంభమయ్యే విధానంగా ముఖ్యమంత్రిని కోరనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. క్రీడా పాఠశాల ప్రారంభమైతే విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయుక్తంగా ఉంటుందని క్రీడాభిమానులు అంటున్నారు.




# రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం



ఈ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ అంచనాలకు మించి రాణిస్తోంది. వర్ష ప్రభావిత మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పటిష్ట ముంబై ఇండియన్స్‌పై విరుచుకుపడింది. దీంతో 27 పరుగుల తేడాతో రియాన్ పరాగ్ సేన ఘన విజయాన్ని సాధించింది. వరుసగా మూడో గెలుపుతో హ్యాట్రిక్ కొట్టిన రాయల్స్.. ఆరు పాయింట్లతో టేబుల్ టాపర్‌గా ఎగబాకింది. అంతకుముందు వర్షం కారణంగా రాత్రి 10.10 గంటలకు ఆరంభమైన మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. ముందుగా రాజస్థాన్ 11 ఓవర్లలో 3 వికెట్లకు 150 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (32 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 నాటౌట్), వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 39) అదరగొట్టారు. స్పిన్నర్ ఘుజన్‌ఫర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 11 ఓవర్లలో 9 వికెట్లకు 123 పరుగులు చేసింది. రూథర్‌ఫోర్డ్ (8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25), నమన్ ధిర్ (13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 25) రాణించారు. బర్గర్, సందీప్, రవి బిష్ణోయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జైస్వాల్ నిలిచాడు.

పోరాటమే లేకుండా..: సవాల్‌తో కూడిన ఛేదనలో ముంబై బ్యాటర్లు ఆరంభం నుంచే తడబడ్డారు. తొలి మూడు ఓవర్లలోనే ఓపెనర్ రికెల్టన్ (8), సూర్యకుమార్ (6), రోహిత్ శర్మ (5) పెవిలియన్‌కు చేరారు. అప్పటికి స్కోరు 22 మాత్రమే. ఇక ఐదో ఓవర్‌లో స్పిన్నర్ బిష్ణోయ్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. కెప్టెన్ హార్దిక్ (9), తిలక్ (14)లను అవుట్ చేయడంతో ముంబై 46/5 స్కోరుతో ఓటమి దిశగా సాగింది. అయితే నమన్, రూ?థర్‌ఫోర్డ్ జోడీ కాసేపు పోరాడింది. ఆరో ఓవర్‌లో నమన్ 6,4తో 14 రన్స్... తర్వాతి ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ రెండు ఫోర్లతో 15 రన్స్ రాబట్టారు. ఇక తుషార్ ఓవర్‌లోనూ రూథర్‌ఫోర్డ్ రెండు సిక్సర్లతో కాస్త ఆశలు రేపాడు. కానీ అదే ఓవర్‌లో స్లో బాల్‌కు క్యాచ్ అవుటయ్యాడు. అయితే ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 17 బంతుల్లోనే 47 పరుగులు జత చేర్చారు. ఆ వెంటనే నమన్‌ను పేసర్ బర్గర్ అవుట్ చేయడంతో ముంబై పరాజయం ఖాయమైంది. తొలి బంతి నుంచే బాదుడు: కొన్ని గంటల పాటు పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచడంతో టాస్ గెలిచిన ముంబై కెప్టెన్ హార్దిక్ వెంటనే బౌలింగ్ ఎంచుకున్నాడు. కానీ బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఓపెనర్లు జైస్వాల్, వైభవ్ పరుగుల వర్షం కురిపించారు. పవర్‌ప్లే 3.2 ఓవర్లే కావడంతో.. అయితే సిక్స్ లేదంటే ఫోర్ అన్నట్టుగా ఈ జోడీ విధ్వంసం సాగింది. పేసర్ దీపక్ చాహర్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే జైస్వాల్ 4,6,4,4,4తో 22 పరుగులు రాబట్టాడు. ఇక వైభవ్ రెండు సిక్సర్లతో పేసర్ బుమ్రాకు స్వాగతం పలికాడు. బౌల్ట్ సైతం 22 పరుగులు సమర్పించుకోగా.. రాజస్థాన్ కేవలం 16 బంతుల్లోనే 50 రన్స్ పూర్తి చేసింది. ఈ దశలో హార్దిక్ నాలుగో ఓవర్‌లో నాలుగు పరుగులే ఇచ్చి కాస్త కట్టడి చేశాడు. ఇక శార్దూల్ ఓవర్‌లో 6,4,6 బాదిన వైభవ్ అదే ఓవర్‌లో వెనుదిరిగాడు. దీంతో తొలి వికెట్‌కు 30 బంతుల్లో 80 పరుగుల తుఫాన్ భాగస్వామ్యం ముగిసింది. జురెల్ (2) విఫలం కాగా.. ఉన్నకాసేపు కెప్టెన్ పరాగ్ (20) రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో వేగం చూపాడు. అటు జైస్వాల్ 23 బంతుల్లోనే వరుసగా రెండో ఫిఫ్టీని పూర్తి చేశాడు. ఆఖరిదైన 11వ ఓవర్‌లో జైస్వాల్ మూడు ఫోర్లతో 18 రన్స్ రాబట్టగా స్కోరు 150కి చేరింది.

రాజస్థాన్: జైస్వాల్ (నాటౌట్) 77, వైభవ్ (సి) తిలక్ (బి) శార్దూల్ 39, జురెల్ (ఎల్బీ) ఘుజన్‌ఫర్ 2, పరాగ్ (సి) తిలక్ (బి) ఘుజన్‌ఫర్ 20, హెట్‌మయెర్ (నాటౌట్) 6, ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 11 ఓవర్లలో 150/3; వికెట్ల పతనం: 1-80, 2-84, 3-121; బౌలింగ్: దీపక్ చాహర్ 1-0-22-0, బుమ్రా 3-0-32-0, బౌల్ట్ 1-0-22-0, హార్దిక్ 2-0-17-0, శార్దూల్ 2-0-36-1

## దిగ్గజ క్రికెటర్ రవిశాస్త్రికి అరుదైన గౌరవం



భారత క్రికెట్ దిగ్గజం, టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రికి ముంబై క్రికెట్ అసోసియేషన్ (వీజూ) అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. ముంబైలోని ఐకానిక్ వాంఖడే స్టేడియంలోని ఒక స్టాండ్‌కు ఆయన పేరు పెట్టాలని నిర్ణయించింది. వాంఖడే స్టేడియంలోని ప్రెస్ బాక్స్ కింద ఉన్న లెవల్ 1 స్టాండ్‌కు 'రవిశాస్త్రి స్టాండ్' అని పేరు పెట్టనున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆటగాడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా, వ్యాఖ్యాతగా ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఎంసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వేడుకలో రవిశాస్త్రితో పాటు ముంబైకి చెందిన మరికొందరు క్రికెట్ దిగ్గజాల పేర్లను స్టేడియం గేట్లకు పెట్టనున్నారు. మహిళా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ పేరును గేట్ నంబర్ 5కు పెట్టనున్నారు. దివంగత బ్యాటింగ్ దిగ్గజం దిలీప్ సర్దేశాయ్ పేరును గేట్ నంబర్ 3కి కేటాయించారు. అద్భుతమైన ఫీల్డర్‌గా పేరుగాంచిన ఏకనాథ్ సోల్కర్ గౌరవార్థం గేట్ నంబర్ 6కు ఆయన పేరు పెట్టనున్నారు. రేపు నిర్వహించే ఈ భారీ ఆవిష్కరణ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్య అతిథిగా హాజరై... ఈ స్టాండ్, గేట్లను అధికారికంగా ప్రారంభిస్తారు. ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరగనుంది. రవిశాస్త్రి ముంబై తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో 6 సిక్సర్లు కొట్టిన రికార్డుతో పాటు, 1983 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడిగా కూడా ఉన్నారు. తన కెరీర్‌లో 80 టెస్టులు, 150 వన్డేలు ఆడి దాదాపు 7 వేల పరుగులు, 280 వికెట్లు తీశాడు.




## విమర్శల నుంచి నేషనల్ అవార్డ్ వరకు..
# 'అల్లు అర్జున్' ప్రయాణం

టాలీవుడ్‌లో వారసత్వంతో అడుగుపెట్టినా తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పాటుచేసుకున్న నటుడు అల్లు అర్జున్. ఐకాన్ స్టార్ ఈ ఏప్రిల్ 8న 44వ పుట్టినరోజు జరుపుకొంటున్నారు. గంగోత్రి సినిమాతో హీరోగా పరిచయమైనప్పుడు బన్నీపై రకరకాల కామెంట్స్ వచ్చాయి. ఒక సాధారణ నటుడిగా కెరీర్ మొదలుపెట్టిన బన్నీ నేడు భారతీయ సినిమా గర్వించదగ్గ స్థాయికి ఎదిగారు. విమర్శించిన నోళ్లే ప్రశంసించేలా తనను తాను మలుచుకున్న తీరు అద్భుతం. కేవలం డ్యాన్సులతోనే కాకుండా తన విలక్షణమైన నటనతో ఇప్పుడు గ్లోబల్ స్టార్‌గా వెలుగొందుతున్నారు. ఈ పుట్టినరోజు సందర్భంగా అల్లు అర్జున్ సాధించిన అరుదైన విజయాలు, భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి ఆసక్తికర విషయాలు ఇక్కడ చూద్దాం.



తొలి చిత్రం 'గంగోత్రి' విడుదలైనప్పుడు అల్లు అర్జున్ నటనపై భారీగా ట్రోల్స్ వచ్చాయి. అయితే 2004లో సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'ఆర్య' సినిమా బన్నీ కెరీర్‌ను మలుపు తిప్పింది. 'ఫీల్ మై లవ్' అంటూ యూత్‌కు ఫ్యాషన్ ఐకాన్?గా మారారు. ఆ తర్వాత వచ్చిన 'దేశముదురు' కోసం సిక్స్ ప్యాక్ బాడీతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టించారు. 'పరుగు' సినిమాలో ఒక బాధ్యతాయుతమైన యువకుడిగా నటించి నంది అవార్డును అందుకున్నారు. 'జులాయి', 'రేసుగుర్రం' వంటి చిత్రాలు ఆయనలోని మాస్ కామెడీ టైమింగ్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశాయి. ప్రతి సినిమాకు తన నటనను మెరుగుపరుచుకుంటూ వెళ్లి నేడు ఈ స్థాయికి చేరుకున్నారు. స్టార్ హోదాను పక్కనపెట్టి 'వేదం' సినిమాలో కేబుల్ రాజు పాత్రలో నటించి బన్నీ అందరినీ ఆశ్చ ర్యపరిచారు. ఒక నిరుపేద యువకుడిగా ఆయన కని పించిన విధానానికి విమర్శ కుల ప్రశంసలు దక్కాయి. మరికొన్నాళ్లకు బోయ పాటి శీను దర్శకత్వంలో వచ్చిన 'సరైనోడు' బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర సృష్టించింది. ఇక త్రివిక్రమ్ శ్రీని వాస్ దర్శకత్వంలో వచ్చిన 'అల వైకుంఠపురములో' నాన్ బాహుబలి రికార్డులను తిరగరాసి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఇందులోని పాటలు బన్నీ మేనరిజమ్స్ ఆల్ టైమ్ బెస్ట్ అని చెప్పవచ్చు. ఈ విజయాలు బన్నీని కేవలం డ్యాన్సర్‌గానే కాకుండా ఒక గొప్ప నటుడిగా నిలబెట్టాయి. తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో ఏళ్లుగా అందకుండా మిగిలిపోయిన 'ఉత్తమ నటుడు' జాతీయ అవార్డును అల్లు అర్జున్ సాధించి చరిత్ర సృష్టించారు. 'పుష్ప: ది రైజ్' చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో ఆయన చూపించిన మ్యానరిజమ్స్, బాడీ లాంగ్వేజ్‌కు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. 2023లో నేషనల్ అవార్డ్ అందుకోవడమే కాకుండా ఇప్పటివరకు 6 ఫిలింఫేర్ అవార్డులు, 3 నంది అవార్డులు అలాగే 5 సైమా అవార్డులను తన ఖాతాలో వేసుకున్నారు. కేవలం నటనతోనే కాకుండా తన హార్డ్ వర్క్?తో టాలీవుడ్ ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన హీరోగా బన్నీ నిలిచిపోయారు.

# 10న థియేటర్స్‌లోకి రానున్న 'డెకాయిట్'

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం 'డెకాయిట్'. ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విక్టరీ వెంకటేశ్, చిత్ర బృందంపై ప్రశంసలు కురిపిస్తూ సినిమా విజయంపై ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ, అడివి శేష్‌ను తాను 'పంజా' సినిమా సమయం నుంచే గమనిస్తున్నానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "పంజాలో శేష్‌ను చూసినప్పుడే అతను భవిష్యత్తులో మంచి నటుడు అవుతాడని నాకు అనిపించింది. ప్రతి సినిమాతో తనను తాను నిరూపించుకుంటూ ఎదుగుతున్నందుకు సంతోషంగా ఉంది" అని వెంకటేశ్ అన్నారు. 'డెకాయిట్' కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుందని ఆయన జోస్యం చెప్పారు.

హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి మాట్లాడుతూ, ఆమె ముఖంలో అద్భుతమైన హావభావాలు పండుతాయని, ఆమె నటన ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని కొనియాడారు. ఎంతో ప్యాషన్‌తో, క్రమ శిక్షణతో ఈ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత సుప్రియ యార్లగడ్డను వెంకటేశ్ ప్రత్యేకంగా అభినందించారు. తాను ఈ వేడుకకు సుప్రియతో పాటు తనకు ఇష్టమైన సురేంద్ర మామయ్య కోసం వచ్చానని చెప్పడం అందరినీ ఆకట్టుకుంది.



## 18 ఏళ్ల కల... 'రాకా'తో నిజమవుతోంది: అట్లీ




ఇండియన్ సినీ ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్లకు ఉండే క్రేజే వేరు. ఈ కోవలోనే అట్లీ -అల్లు అర్జున్ కాంబోలో తెరకెక్కుతోన్న మూవీపై భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి 'రాకా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈరోజు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్‌తో పాటు కొత్తగా ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అందులో అల్లు అర్జున్? గుండుతో, కంటి చూపుతోనే శత్రువులను భయపెట్టే వాడిలా చూస్తూ, తోడేలు లాంటి చేతులతో కనిపించారు. ఈ పోస్టర్‌ను చూసి అల్లు అర్జున్ అభిమానులు తెగ మురిసిపోతున్నారు. దర్శకుడు అట్లీ ఈ సినిమాకు తన పోస్ట్?తో మరింత హైప్ తెచ్చారని సోషల్? మీడియాలో అభిమానులు చర్చించుకుంటున్నారు. అట్లీ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో 'రాకా' కేవలం భారీ బడ్జెట్ ప్రాజెక్ట్ కాదని, ఇది అతను దాదాపు రెండు దశాబ్దాలుగా కాపాడుకుంటూ వస్తున్న ఒక కల అని తెలిపారు. "18 ఏళ్లుగా నేను ఒకే ఆలోచనను పట్టుకుని, దాన్ని మసకబారనివ్వలేదు. అది నన్ను పరీక్షించింది, తీర్చిదిద్దింది, అన్ని సమయాల్లో నాతోనే ఉంది. నిజం చెప్పాలంటే ఇది కేవలం ఆరంభం మాత్రమే" అని అన్నారు. అట్లీ వ్యాఖ్యలతో 'రాకా' సాధారణ సినిమాలాగా ఉండదనే చర్చ సినీ వర్గాల్లో నడుస్తోంది. 2027 వేసవిలో ఏడు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తోంది. అల్లు అర్జున్ - అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అల్లు అర్జున్ అభిమానులు అంటున్నారు.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**